సస్యరక్షణతో లాభాల పంట

- అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో 57 వేల పైచిలుకు ఎకరాల్లో వెదజల్లు
- సకాలంలో కలుపు నివారణ చర్యలతో అధిక దిగుబడులు
- 15 శాతం పూర్తయిన వరి సాగు



పెదపూడిలో వెదసాగు పొలంలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: రబీ సీజన్‌లో వెద సాగు విధానంలో ఎక్కువ మంది అన్నదాతలు వరి సాగు చేస్తున్నారు. వ్యవసాయ ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలతో పాటు కూలీ ఖర్చులు తడిసి మోపుడవ్వడంతో రైతులు నాట్లు వేసే పద్ధతికి క్రమంగా స్వస్తి చెబుతున్నారు. దీంతో రైతుకు మేలు జరిగే వెద జల్లు సాగు విధానంలో రైతులు ముందుకు సాగుతున్నారు. ఈ విధానంలో కలుపు సమస్య తలెత్తుతుంది. దీని నివారణకు సకాలంలో కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు చేపట్టవచ్చని పెదపూడి మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు.

వరి సాగు 57 వేల ఎకరాల పైచిలుకే..

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో మొత్తం ఏడు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 57,442 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 12 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2 వేలు, బిక్కవోలులో 13 వేలు, కోరుకొండలో 2,465, సీతానగరంలో 1,917 ఎకరాలు, రాజానగరంలో 8,060 ఎకరాల్లో అన్నదాతలు సాగుకు సిద్ధమయ్యారు. ఆయా మండలాల్లో సుమారు 80 శాతం మేర రైతులు వెదజల్లు సాగు విధానంలో వరిని సాగు చేయడానికి సిద్ధమైనట్టు ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికి 15 శాతం మేర వెదసాగు చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.

కలుపు యాజమాన్య పద్ధతి

ఈ పద్ధతిలో నీరు నిల్వగట్టడం ఉండదు. దీంతో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. కలుపు నివారణకు సమగ్ర నివారణ చర్యలు చేపట్టాలి. విత్తనం విత్తిన తర్వాత భూమిలో తగు మాత్రం తేమ ఉండే పరిస్థితుల్లో కలుపు మందు వాడాలి. ఎకరానికి లీటరు పెండిమిథాలిన్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్, సేఫనర్ లేదా 35 గ్రా. అక్సాదయార్జిల్‌లో ఏదో ఒక మందును 200 లీటర్ల నీటిలో కలపాలి. భూమిపై విత్తిన 2–5 రోజుల సమయంలో దానిని పిచికారీ చేయాలి. విత్తనం విత్తిన 15–20 రోజులకు కలుపు ఉధృతి ప్రకారం బిస్‌పైరిబాక్ సోడియంను పిచికారీ చేయాలి. అన్నిరకాల కలుపు మొక్కలు ఉన్నప్పుడు 30 రోజుల తర్వాత ఒకసారి కూలీలతో కలుపు తీసి, గొప్పు తవ్వించడంతో కలుపు మొక్కలు నశించడమే కాక, గుల్లబారి ఎక్కువ తేమ భూమిలో నిల్వ ఉంటుంది. పంట వేరు వ్యవస్థ దృఢంగా తయారవుతుంది. పంట వరుసల్లో విత్తితే, వరుసల మధ్య అంతరకృషి చేసుకోవచ్చు.

రబీ సాగుకు వరిలో రకాలు

ఈ రబీ సీజన్లో ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 రకాలను సుమారు 80 శాతం రైతులు సాగు చేస్తున్నారు. అలాగే మిగిలిన 20 శాతంలో విత్తనాల కోసం స్వర్ణరకం, బొండాలు, ప్రైవేటు వరి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ఆరుతడి వరిలో సాధరణంగా వేసే మగాణి వరి దిగుబడులతో పోల్చినప్పుడు సుమారు 80–90 శాతం దిగుబడులు పొందవచ్చు. సాగు ఖర్చు తగ్గి, అధిక నికరాదాయం సాధించే అవకాశం ఉంది.

నీటి యాజమాన్య విధానం

పంటకు ప్రతి 7–10 రోజులకోసారి అవసరం మేరకు నీటి తడులు పెట్టాలి. ఆరుతడి వరి పొలంలో ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉంచాల్సిన అవసరం లేదు. పంటకు కావాల్సిన తేమను అందించడం పంట కీలకదశల్లో ఎలాంటి తెగుళ్ల బెడద లేకుండా చూడటం ప్రధానమైన అంశం. అధిక వర్షాలుంటే నీటితడులు అవసరం ఉండదు. రబీలో 4–5 తడులతో వరి సాగు చేసుకునే అవకాశం ఉంది. నీటిని 40–50 శాతం మేర ఆదా చేసుకోవచ్చు.

సకాలంలో కలుపు నివారణతో..



వెదసాగు విధానంలో సకాలంలో వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించి కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అధిక దిగుబడులకు సాధ్యమవుతుంది. మండలంలో 15 శాతం మేర వెద సాగును రైతులు పూర్తి చేశారు. 85 శాతం మేర రైతులు వెదసాగు చేస్తున్నారు. మండలంలో మొత్తం 18 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది.

– టీవీఆర్ మణిదీప్, వ్యవసాయ శాఖాధికారి, పెదపూడి మండలం

క్లుప్తంగా

పంచ చెట్టు గ్రామోత్సవం



పందలపాకలో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో వెలంపేట రామాలయం వద్ద ఉన్న ఏకాహం ముగింపు సందర్భంగా ఆదివారం సీతారామ పంచ చెట్టుతో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా తుల్యభాగ నదిలో జలాభిషేకం చేసి అనంతరం గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు దత్త జయంతి

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుక మంగళవారం జరుగనుంది. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఆలయంలో కొలువై ఉన్న దత్తాత్రేయునికి అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 6.30 గంటల నుంచి గురు చరిత్ర పారాయణను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం హారతి అనంతరం అన్న సమారాధన నిర్వహించి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం పురవీధులలో సాయి పల్లకీ ఉత్సవం జరుగుతుంది. భక్తులు పాల్గొవాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు



డ్రైవర్స్‌కాలనీలో కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న పండితులు

గోకవరం: స్థానిక డ్రైవర్స్‌కాలనీలో వేంచేసిన కనకదుర్గమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మవారి పాత ఆలయం స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం ఉదయం 8.54 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన



సీతానగరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం

సీతానగరం: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ వద్ద అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామివారికి పూజలు చేసి, అన్నసమారాధన ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజల సహకారంతో జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

అనూషకు డాక్టరేట్



అవార్డు సాధించిన కె.అనూషతో ఆర్ట్స్ కళాశాల బృందం

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకురాలు కె.అనూషకు డాక్టరేట్ వచ్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు శనివారం తెలిపారు. మత్స్య ఆహారంలో వ్యాధికారక విబ్రియో జాతుల ఆవిర్భావాన్ని ప్రభావితం చేసే సూక్ష్మజీవుల పరస్పర చర్యలు అనే అంశంలో అనూష పరిశోధన చేశారన్నారు. కృష్ణ యూనివర్సిటీ మచిలీపట్నంలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారని, ఈ నెల 22వ తేదీన అవార్డు ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనూష కళాశాలలో మహిళా ఎన్‌సీసీ విభాగానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీశైల శాస్త్రి, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు కృపా సంఘ క్రిస్మస్ క్యారల్స్

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలులోని క్రీస్తు కృపా సంఘం ద్వారా రెవరెండం టాటా విక్టర్, సుగుణ, చర్చి సభ్యులందరరూ ఆదివారం సాయంత్రం క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించారు. పాటలు పాడుతూ, చిన్నారుల డ్యాన్స్‌లతో, క్యాండిల్ వెలిగించి, కేక్ కట్ చేసి ముందుగా క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

యువజన విభాగాల అధ్యక్షులు వీరే

రాజానగరం: నియోజకవర్గంలోని మూడు మండలాలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు విడుదలయ్యాయి. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ నియామకాలు జరిగాయి. మండల యువజన అధ్యక్షులుగా సీతానగరానికి కోలా శ్రీను, రాజానగరానికి పిల్లా లక్ష్మీనారాయణ, కోరుకొండకు ఉల్లి గణలను నియమించారు. ఈ పదవులు తమను వరించడానికి ప్రధాన కారకులైన స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

లోక రక్షణకే క్రీస్తు జననం

పెదపూడి: లోక రక్షణకే ఏసు క్రీస్తు జన్మించారని పాస్టర్ చుక్కా శామ్యూల్‌రాజు అన్నారు. ఆదివారం పెదపూడిలోని బేతేలు ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్‌రాజ్, దేవకుమారి దంపతులు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం చిన్నారులు, యువతకు క్విజ్ పోటీలు, కుర్చీలాట, నృత్యాలు, నాటికలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో భక్తులు కొవ్వొత్తులు చేతబట్టి ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ చుక్కా జాన్ రత్నం, వర ప్రసాద్, చర్చి యూత్ పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ శోభ

- విద్యుత్ దీప కాంతుల్లో చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు

బిక్కవోలు: క్రైస్తవులకు క్రిస్మస్ పండగ ఎంతో ప్రత్యేకం. సోమవారం క్రిస్మస్ వేడుకల నేపథ్యంలో చర్చిల్లో క్రిస్మస్ శోభ నెలకొంది. రంగురంగుల విద్యుత్ దీపకాంతులతో చర్చిలను అలంకరించారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో క్రిస్మస్ స్టార్, ఏసు జననానికి గుర్తుగా పశువుల పాకలు వేసి తమ భక్తిని తెలియజేస్తున్నారు. పలు చర్చిల్లో ఇప్పటికే క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన క్రీస్తు జన్మదినం ప్రపంచ మానవాళికి ఒక పండగ దినమని ప్రబోధిస్తున్నారు.

చర్చిల్లో సందడే సందడి

నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలను సుందరంగా ముస్తాబు చేశారు. చర్చిలకు రంగులు వేయించారు. చర్చిలపై ఏర్పాటుచేసిన విద్యుత్ దీప తోరణాలు, పెద్దపెద్ద స్టార్లు కనువిందు చేస్తున్నాయి. రంగురంగుల బెలూన్లు, వివిధ ఆకృతుల్లో రంగు కాగితాలతో ప్రార్థనా మందిరాల లోపల అలంకరించారు.

డిసెంబర్ నెల వచ్చిందంటే క్రైస్తవ కుటుంబాల్లో పండగ వాతావరణం ప్రారంభమవుతుంది. చాలా మంది డిసెంబర్ 1వ తేదీ నుంచి క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభించారు. చర్చిల్లో సండే స్కూల్ పేరుతో చిన్నారులు, యువతకు బైబిల్‌పై ప్రతి ఆదివారం ప్రత్యేక బోధన నిర్వహిస్తున్నారు. క్రీస్తు బోధనలు పాటించి సన్మార్గంలో నడవాలని సూచిస్తున్నారు. చిన్నారులు, యువత క్రిస్మస్ వేడుకల్లో క్రీస్తు జననం, క్రీస్తు జీవితం, ఆయన చేసిన అద్భుతాలు, బైబిల్‌లోని పలువురు ప్రవక్తల పాలనపై నాటికలు, నృత్యాలు ప్రదర్శిస్తున్నారు.

గోకవరం: ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగకు నియోజకవర్గంలోని చర్చిలు సిద్ధమయ్యాయి. సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేశారు. గోకవరం మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి, కృష్ణునిపాలెంలోని ఈహెచ్‌హెచ్ చర్చి, రంపయర్రంపాలెంలోని సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. ఆయా చర్చిల్లో ఆదివారం రాత్రి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించారు.

ఆర్‌సీఎంలో ముగిసిన నవదిన ప్రార్థనలు

మధురపూడి: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రీస్తు కోసం జాగరణ ప్రార్థనలు చేశారు. కోరుకొండ మండలంలో ఆర్‌సీఎం, లూథరన్ తదితర మిషనరీల్లో క్రైస్తవులు వేడుకలు జరుపుకొన్నారు. కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్య సందేశం ఇచ్చారు. సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించకునేందుకు కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, గాడాల, నిడిగట్ల, కోటికేశవరం, గాదరాడ తదితర గ్రామాల్లో చర్చలు ఏర్పాటు చేశారు. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం, రెవరెండ్ ఇశ్రాయేలు, ఉపదేశులు బెల్లపు డేవిడ్, కొవ్వాడ జ్ఞానేష్, గానుగూడెం లూథరన్ చర్చి డెలిగేట్ గొల్లపల్లి ప్రవీణ్, కోశాధికారి ఇ.ఎజ్రా, వరదానం తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న చర్చిలు

అనపర్తి: క్రిస్మస్ పండగ సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది. క్రిస్మస్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు క్రీస్తు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక శిలువలమ్మగుడి, ఐఎల్‌టీడీ సమీపంలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, కెనాల్ రోడ్డులోని ఆర్‌సీఎం ప్రార్థనా మందిరాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఏసు కృపాలయాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.



కాపవరంలో సెంటినరీ ట్రానిటీ లూథరన్ చర్చి

క్రీస్తు జననం అద్భుతం



క్రీస్తు జననం ఒక అద్భుతం. పాపులను రక్షించడానికే క్రీస్తు జన్మించారు. నమ్మకం ఉన్న వారిని ప్రభువు ఎప్పుడూ రక్షిస్తూనే ఉంటాడు. పండగ వాతావరణంలో అందరూ క్రిస్మస్ చేసుకోవాలి.

– బిషప్ ఎంఎస్ సమర్పణ్, బ్లెస్సింగ్ ప్లేస్ చర్చి, తొస్సిపూడి



విద్యుత్ దీపకాంతులతో అనపర్తి సియోను మందిరం



విద్యుద్దీపాలతో అలంకరించిన కోరుకొండ ఆర్‌సీఎం చర్చి



విద్యుత్ దీపకాంతులతో అనపర్తి సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి

మహా అన్నసమారాధన



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా బిక్కవోలు ప్రాచీన శ్రీగోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో కొలువై ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కోవెల వద్ద ఆదివారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 15 వేల మంది స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీ కృష్ణారెడ్డి, బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్రి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమద్ వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదాసాంజనేయ స్వామివారు



చినకొండేపూడిలో స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

సీతానగరం: చిన కొండేపూడిలోని అభయాంజేయ స్వామి ఆలయంలో శ్రీహనుమాన్ వ్రత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం చిన కొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్ వద్ద గల అభయాంజేయ స్వామి వారి ఆలయం ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్‌ఐసీ రాజు ఆధ్వర్యంలో హనుమాద్ వ్రత మహోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి పూజా కార్యక్రమం ప్రారంభించారు. సామూహిక వ్రతాలలో 20 మంది దంపతులు పాల్గొన్నారు. ఇదే విధంగా సామూహిక వ్రతాలను నిర్వహిస్తున్నామని, అయిదు రోజులు స్వామివారికి ఉత్సవం నిర్వహింస్తామన్నారు. ఈనెల 29న అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఎల్‌ఐసి రాజా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పంచాయతీ వీధిలో కొలువైన శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం ఆదివారం నిర్వహించారు. ఆలయం కమిటీ చైర్మన్ ఓవీ కృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామివారికి గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, గంగా సింధూర, తమలపాకుల పూజ, పుష్పార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు.

ఘనంగా హనుమద్ వ్రతం

అనపర్తి: స్థానిక నల్లకాలువ వంతెన వద్ద కొలువుదీరిన శ్రీసంపత్ కృష్ణ ఆంజనేయ మందిరంలో హనుమద్ వ్రత వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని ఈ వ్రతాన్ని నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగదేవర వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పండితులు స్వామికి ముందుగా విఘ్నేశ్వరపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష అలంకరణ చేశారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- గరగలంపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకు, విద్యుత్ ఇంటర్ లైన్ ప్రారంభం



గరగలం పాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: గ్రామీణ ప్రాంతాలభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గరగలంపాలెంలో రూ.42 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, రూ.10 లక్షలతో గోపాలపురం నుంచి గరగలంపాలెం వరకూ నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. 36 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఎస్టీ కమ్మర సామాజిక వర్గానికి చెందిన పలువురికి కుల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేదల కోసం పనిచేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేసి ఆర్థిక అభివృద్ధిని పెంచారన్నారు. ప్రజలను పట్టించుకొని టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, గరగలం పాలెం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం



గ్రామంలో కొలువైన అభయాంజనేయస్వామి

రంగంపేట: స్థానిక అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం తీర్థ బిందె తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించి అనంతరం తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి జరిగే తీర్థానికి విశేషంగా భక్తులు హాజరయ్యారు. బ్యాండు పార్టీల పోటీలు, మేళతాళాలు, కోయ నృత్యాలు, కళ్ళు మిరిమిట్లు గొలిపేలా బాణసంచా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం

కడియం: కడియపులంక గ్రామంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథంలో అంశాలను ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శేఖర్ బాబు, పీఎస్ఎన్ మూర్తి, లక్ష్మీనారాయణ, విజయ్, భరత్, సంధ్యారాణి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలి



మహిళలకు గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్న సోము వీర్రాజు తదితరులు

రంగంపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఆదివారం రంగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ బదిరెడ్డి లక్ష్మి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీర్రాజు మాట్లాడుతూ 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలన్నది ప్రధానమంత్రి మోదీ సంకల్పమన్నారు. దీనికోసం అధికారులు సమన్వయంతో పని చేసి దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. అనంతరం స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.65 వేలతో ఏర్పాటుచేసిన మినీ వాటర్ ప్లాంటుని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య కార్యదర్శి కిరణ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, మండల అధ్యక్షుడు సాయిరాం, రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు ఆదిత్య పాల్గొన్నారు.